VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 258
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 27 ఫిబ్రవరి 2026

# ప్రతీ ఎకరాకు నీటితో తెలుగు తల్లికి జలహారతి

**● రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై త్వరలో బ్లూప్రింట్ ● మే 15 కే నారుమళ్లకు నీళ్లిచ్చేలా ప్రణాళిక ● నీటి భద్రతపై దీర్ఘకాలిక విజన్ కూటమి ప్రభుత్వానిది ● వెలిగొండకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి గత పాలకుల క్రెడిట్ చోరీ ● సాగునీటి రంగంపై చర్చ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**




**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ప్రతీ ఎకరాకూ నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వటమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టులను పూర్తి చేసే అంశంపై త్వరలోనే బ్లూ ప్రింట్ తయారు చేస్తామని శాసనసభలో వెల్లడించారు. సాగునీటి రంగానికి బడ్జెట్ కేటాయింపులపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా పదిసూత్రాలను రూపొందించుకుని నీటి భద్రతపై కూటమి ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆయన అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నా నీటి భద్రత అత్యంత కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది గోదావరి, మరుసటి ఏడాదిలో కృష్ణా పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి వచ్చిందని అన్నారు. ప్రకృతిని, నదులు, నీటి వనరులను ఆరాధించే సంస్కృతి ఉన్న నేపథ్యంలో గోదావరి నదికి అఖండ హారతిని, కృష్ణా నదికి పవిత్ర హారతి ఇచ్చి జలాలను అత్యంత విలువైన వనరులుగా భావించి బాధ్యతగా వ్యవహరిస్తున్నామని సీఎం అన్నారు. ప్రతీ ఏటా గోదావరి నది నుంచి సగటున 3 వేల టీఎంసీల వరద నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయని అన్నారు. అందుకే రాష్ట్రంలోని వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలోని నదులను అనుసంధానిస్తే నీటి సమస్యలు పరిష్కారం అవుతాయని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోనూ గంగా- కావేరి నదుల అనుసంధానం జరగాలన్నది తన బలమైన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గతంలో వాజ్ పేయి ప్రభుత్వంలో గంగా- కావేరీ నదుల అనుసంధాన సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిగాయన్నారు. అందుకే రాష్ట్రంలో నదులు అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే..** 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్ల వ్యయం చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గడచిన 20 నెలల్లో రూ.20 వేల కోట్లను ఈ రంగానికి వెచ్చించినట్టు తెలిపారు. 738 కిలోమీటర్ల మే-ర హంద్రీనీవా కాలువను విస్తరించి కుప్పంలో పరమసముద్రం చెరువు వరకూ నీటిని తీసుకెళ్లామని అన్నారు. మడకశిర వరకూ నీటిని తీసుకెళ్లి ఆ ప్రాంత వాసుల దాహార్తిని తీర్చామని మ-ుఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టుల న్నీ టీడీపీ, కూటమి హయాంలో నిర్మించినవేనని సీఎం స్పష్టం చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ కట్టిన కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుంచుకుంటున్నామని అన్నారు. ఆనాడు రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు చేపట్టింది ఎన్టీఆర్ అని సీఎం స్పష్టం చేశారు. పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు నీరిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలను రాయలసీమకు తరలించామని.. అందుకే ఆ ప్రాంతం రతనాల సీమగా మారిందన్నారు. వెలిగొండ పూర్తి చేసి మార్కాపురం, ప్రకాశం జిల్లా సహా వివిధ ప్రాంతాలకు న్యాయం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. 30 ఏళ్లకు ముందు ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని.. ఇప్పుడు ఈ ఏడాది జూలైలోనే మొదటి దశ పూర్తి చేసి నీళ్లు ఇస్తామని అన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయాలంటే ఇంకా రూ.2500 కోట్ల మేర వ్యయం చేయాల్సి ఉందని .. బుధవారమే రూ.456 కోట్ల వ్యయంతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసినట్టు వివరించారు. వెలిగొండకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ చోరీ చేసే ప్రయత్నం గత పాలకులు చేశారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. కుప్పంలోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో నీళ్లు పోశారని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపైనా గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని సీఎం ఆక్షేపించారు. రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామని వివరించారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి.. డయాఫ్రాం వాల్ ను గోదాట్లో కలిపేశారని సీఎం వ్యాఖ్యానించారు. మళ్లీ ఆ ప్రాజెక్టును పరుగులు పెట్టించి పుష్కరాలకంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. అలాగే చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాల్లోని ఎగువ భూములకు నీరందేలా చర్యలు చేపడతామన్నారు.

**ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు..** రాష్ట్రంలోని అన్ని చిన్నా పెద్ద రిజర్వాయర్లలో 1312 టీఎంసీల మేర

- 4లో

## బాధ్యత మరిచి మనిషిగా పతనం కావద్దు

**● గ్రూప్1,--2 నూతన అధికారుల శిక్షణా కార్యక్రమం ముగింపు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దశ,దిశా నిర్దేశనం**



**హైదరాబాద్,కలంకౌంటర్ :** గ్రూప్--1, 2 నూతన అధికారుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంతో మాట్లాడుతూ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను అభినందిస్తూ, "మొన్న మీరు విద్యార్థులు... నిన్న నిరుద్యోగులు... ఈ రోజు అధికారులు. ఇకపై నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత మీదే" అని స్పష్టం చేశారు. తెలంగాణ చరిత్రను స్మరించుకుంటూ, "తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని ఒప్పుకోరు" అని పేర్కొన్నారు. రాంజీ గోండు, కొమరం భీం రాజ్యాల కోసం కాదు, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. అలాగే సమ్మక్క--సారలమ్మలు కాకతీయ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసి సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ కోసం అమరవీరులయ్యారని అన్నారు. వారి స్ఫూర్తిని అధికారులుగా ఎప్పటికీ గుర్తుంచుకోవాలని సూచించారు.మొదటి లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచిన తెలంగాణ బిడ్డ రావి నారాయణ రెడ్డిను ఉదాహరణగా పేర్కొన్నారు. ఆరు లక్షల మంది పోటీపడగా 582 మంది గ్రూప్--1, గ్రూప్? 2 లో 775 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు.15 ఏళ్లుగా గ్రూప్--1 నియామకాలు జరగలేదని, ప్రజా ప్రభుత్వం నిర్వహించి అభ్యర్థుల ఆకాంక్షలను నెరవేర్చిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి, గ్రూప్ పరీక్షలపై అవగాహన ఉన్నవారిని చైర్మన్, సభ్యులుగా నియమించామని వివరించారు.

## వివాహా వేడుకకు వై ఎస్ జగన్





**నెల్లూరు,కలంకౌంటర్ :** స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత కొండూరు అజయ్ రెడ్డి (రైల్వే కోడూరు) కుమారుడి వివాహ వేడుకకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు సిద్దు సుష్మా, ప్రతుల్య రెడ్డి లకు వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన వైయస్ జగన్



# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న చీఫ్ పోస్ట్ మాస్టర్



**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని గురువారం దర్శించుకున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ హెడ్ ఆఫ్ ది ఆంధ్రప్రదేశ్ బి. పి శ్రీదేవి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు . ఈ కార్యక్రమంలో పెద్దప్రోలు పోస్టుమాస్టర్ చింతపల్లి శ్రీవల్లి ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు, మణిదీప్ విరూప్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

# టీడీపీ నేతకు వెంకట్రామ్ పరామర్శ



**మోపిదేవి,కలంకౌంటర్ :** కిడ్నీ సమస్యతో బాధపడుతున్న టీడీపీ నేతను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. మోపిదేవి మండల పరిధిలోని వెంకటాపురంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గొరిపర్తి వేణుగోపాలకృష్ణ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనను మండలి వెంకట్రామ్, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు పరామర్శించి ధైర్యం చెప్పారు.

# జనసేన క్రియాశీల సభ్యత్వాలు నమోదు ప్రారంభించిన దేవకి



**కనిగిరి, కలంకౌంటర్ :** రాష్ట్ర జనసేన నాయకులు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు నెంబర్ దేవకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నందు జనసేన క్రియాశీల సభ్యత్వాల నమోదు పిఓసి వరికూటి నాగరాజు అధ్యక్షతన కార్యక్రమం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనసేన నాయకులు కార్యకర్తలు అందరూ కష్టపడి, నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో కంటే అధిక స్థాయిలో సభ్యత నమోదు కార్యక్రమం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పార్టీలలో కంటే భిన్నంగా జనసేనలో సామాన్య కార్యకర్తలు సైతం ఎమ్మెల్యేలుగా, ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్నారని తెలిపారు. జనసేన పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని దేవకి తెలిపారు. ఈ కార్యక్రమంలోప్రకాశం జిల్లా కార్యదర్శి ఎలమందల రహీముల్లా,పామూరు మండల అధ్యక్షుడు దర్శి ఏడుకొండలు, పిసి పల్లి మండల అధ్యక్షులు బండారు రాజు, సిఎస్పురం మండల అధ్యక్షులు జానపాటి రాజా, హెచ్ఎం పాడు మండల అధ్యక్షులు ఆకుపాటి వెంకట్రావు,గవర్నమెంట్ హాస్పటల్ డైరెక్టర్ అక్బర్,కనిగిరి నియోజకవర్గం చిరంజీవి యువత అధ్యక్షులు షేక్ బాషా, అంజి నాయుడు, శానం ఆంజనేయులు, వరికుటి నాగరాజు, వంశీకృష్ణ, ఐటి విభాగం కంచర్ల వంశీకృష్ణ, పిఓసి తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 4వ తేదీన శాసన మండలిలో తిరుపతి లడ్డుపై లఘు చర్చకు సిద్ధం:ఆర్థికమంత్రి

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర శాసన మండలిలో మార్చి 4వతేది బుధవారం తిరుపతి లడ్డు అంశంపై లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఆర్థిక మరియు శాసన సభా వ్యవహారాల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ వెల్లడించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఏసి సమావేశంలో నిర్ణయం తీసుకున్న ప్రకారం శాసన మండలిలో తిరుపతి లడ్డుపై చర్చించుందకు ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం వ్యవసాయ శాఖపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. శాసన మండలిలో తిరుపతి లడ్డు అంశంపై రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి స్టేట్మెంట్ ఇచ్చే ప్రయత్నం చేస్తే చదవడానికి వీలు లేదు ముందుగా వైసిపి సభ్యులు మాట్లాడాలని అడ్డుతగలడం సరికాదని పేర్కొన్నారు. సాధారణంగా బిజినెస్ అడ్వైజరీ కమిటీలో చర్చకు నిర్ణయం తీసుకున్న తర్వాత సంబంధిత మంత్రి సభలో స్టేట్మెంట్ చదవడం జరుగుతుందని అయితే సభ్యులు ముందుగా మాట్లాడాలని డిమాండ్ సాంప్రదాయం కాదని ఖండించారు. కేవలం వైసిపి సభ్యులు సభకు రావాలి,అల్లరి చేయాలి,బట్ట కాల్చి మొఖాన వేయాలని ధోరణితో సభకు వచ్చి వాక్ అవుట్ చేసి పోతున్నారన్నారు. వైసిపి వాక్ అవుట్ అవుట్ పార్టీగా మారిపోయిందని మంత్రి పయ్యావుల ఎద్దేవా చేశారు. ఎందుకంటే వాస్తవాలు కళ్ళ ముందు కొస్తే వైసిపి సభ్యులు తట్టుకోలేరు కనుక ఆవిధంగా అడ్డుపడుతున్నారని మంత్రి కేశవ్ పేర్కొన్నారు. వాళ్ళకి చర్చ మీద అసలు ఇంట్రెస్ట్ లేదు అనడానికి గురువారం జరిగిన సంఘటన నిదర్శనమని చెప్పారు. వాస్తవంగా చెప్పాలంటే చర్చ కావాలని సభకు నోటీస్ కూడా ఇవ్వలేదు అయినా ప్రభుత్వం ముందుకు వచ్చి దాని మీద చర్చకు పెట్టిందని తెలిపారు. వారు కోరిన ప్రకారం శాంతిభద్రతలు,ఇరిగేషన్ పై చర్చ కావాలన్నారు చర్చ పెట్టామని చెప్పారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి.. మాతృభాషను మరువొద్దు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు







**అమరావతి,కలంకౌంటర్ :** చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే దిశగా కొనసాగుతున్న ఏపీ అసెంబ్లీ విజ్ఞాన యాత్రలో భాగంగా మంగళవారం 495 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. గత పది రోజులుగా ఉత్సాహంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 107 పాఠశాలలకు చెందిన 3,718 మంది విద్యార్థులు అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. చిన్న వయసులోనే సభా కార్యక్రమాలను చూసే అవకాశం దక్కడం పట్ల విద్యార్థులు అమితానందం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా నర్సీపట్నం రిషి వ్యాలీ స్కూల్‌కు చెందిన 120 మంది విద్యార్థులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని ప్రత్యేకంగా కలిశారు. సభా విరామ సమయంలో వారితో ఆత్మీయంగా ముచ్చటించిన స్పీకర్.. విద్యార్థులు అడిగిన పలు ఆసక్తికరమైన సందేహాలను ఓపికగా నివృత్తి చేశారు. అసెంబ్లీని సందర్శించిన ఈ విద్యార్థులందరికీ త్వరలోనే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును సైతం చూసే అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. యువత కేవలం చదువు, ఉద్యోగాలు, కుటుంబం వరకే పరిమితం కాకుండా.. సమాజానికి మెరుగైన సేవలు అందించేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో మాతృభాష ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఇళ్లలో ఆంగ్లం కాకుండా తెలుగులోనే మాట్లాడాలని, 'మమ్మీ, డాడీ' అనడానికి బదులుగా మన సంస్కృతి ఉట్టిపడేలా 'అమ్మ, నాన్న' అని ఆప్యాయంగా పిలవాలని విద్యార్థులకు సూచించారు. మన తెలుగు భాషను, మూలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోకూడదని ఆయన హితబోధ చేశారు.

# సీమ ఎత్తిపోతల దుష్ప్రచారంపై శివమెత్తిన మంత్రి నిమ్మల

**అమరావతి,కలంకౌంటర్ :** రాయలసీమ ఎత్తిపోతల పథకం మధ్యలో ఆగిపోవడానికి ముమ్మాటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డే కారణమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. ఈ ఎత్తిపోతల పథకం వెనుకున్న ఆంతర్యాన్ని ఎండగట్టారు. తేదీలు, జీవో నెంబర్లు, ఎన్జీటీ ఉత్తర్వులు సహా చూపించి నిజాలు నిగ్గుతేల్చారు. గురువారం శాసనమండలిలో వైకాపా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రామానాయుడు సుదీర్ఘ సమాధానం ఇచ్చారు. సీమ ఎత్తిపోతల పథకాన్ని నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి సీమ ప్రజల కోసం కాకుండా స్వీయ ప్రయోజనాల కోసం రూపకల్పన చేసి, అవసరమైన అనుమతులు లేకుండా వడివడిగా ప్రారంభించారన్నారు. రాయలసీమ లిఫ్ట్ పేరుచెప్పి గుంతలు, మట్టి వంటి పనులు చేసి, 5ఏళ్ళలో ఒక్క చుక్క నీరు కూడా తీసుకురాలేదు. గాలేరు–నగరికి హంద్రీనీవా లింక్ పేరు చెప్పి, పైపులు తెచ్చి ప్రాజెక్టు సైట్ లో పెట్టారు, తరువాత మట్టి పనులు చేసి 900 కోట్ల రూపాయలు బిల్లులు చేసుకున్నారు. ఇక్కడ కూడా ఒక్కచుక్కనీరు ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆవులపల్లి, బుదివేడు, నేతిగుంటపల్లి రిజర్వాయర్ల పేరు చెప్పి మట్టి పనులు చేశారు. ఈ పనులకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో 100 కోట్ల జరిమానా విధించింది. ఇలా కేవలం జేబులు నింపుకోవడానికే చేసిన పనులు తప్ప, రాయలసీమ పై ప్రేమతో కాదని, తేల్చి చెప్పారు. రాయలసీమ కి ద్రోహం చేసింది ఎవరో ప్రజలే తేల్చి చెబుతున్నారని అన్నారు మంత్రి నిమ్మల. పోతిరెడ్డిపాడు నుండి ఈఏడాది 203 టిఎంసిల నీటిని తీసుకుని రాయలసీమ కు తరలించాం. రాయలసీమకు ఎంతో కీలకమైన గోరకల్లు రిజర్వాయర్ ప్రమాదంలో ఉంటే, కడప జిల్లాకు, పులివెందులకు నీళ్ళు రావని తెలిసినా కూడా మరమ్మత్తులకు 60 కోట్ల నిధులు కావాలని అధికారులు కోరినా గత ముఖ్యమంత్రి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆధారంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పై బురద చల్లాలని అను కోవటం మీ అవివేకమని ఖండించారు. ఆ మాటకొస్తే అప్పటి టిఆర్ఎస్ మంత్రి హరీష్ రావు, అప్పటి ముఖ్యమంత్రి జగన్ తో మాట్లాడి మేమే సీమ



ఎత్తిపోతల పథకం ఆపించామని చెప్పారు. నీళ్లు కావాలా, రాజకీయ ప్రయోజనాలు కావాలా అని అడిగితే నాటి మీ సీఎం జగన్మోహన్ రెడ్డి నీళ్లకు, నీళ్లు వదిలేసారని వార్తలు వచ్చాయని రామానాయుడు చెప్పారు. దీనికి మీరేం సమాధానం చెబుతారని వైసిపి సభ్యులను నిలదీశారు. పొరుగు రాష్ట్ర నేతలు వారి రాజకీయ లబ్ధి కోసం ఏవేవో అంటారు. మాట్లాడుతారు. కానీ ఇక్కడున్న మీరు వాస్తవాలు ఆధారంగా మాట్లాడాలి కదా అని రామానాయుడు ప్రశ్నించారు. అసలు సీమ ఎత్తిపోతల పథకం ఎందుకు ఆగింది, ఎవరి హయాంలో ఆగిందిలి? తెలిసి ఉండే మాట్లాడుతున్నారా అంటూ రామానాయుడు సూటిగా ప్రశ్నించారు. 2020 ఫిబ్రవరి 20న అధికారంలో ఉన్నది. జగన్మోహన్ రెడ్డా, చంద్రబాబునాయుడా అని రామానాయుడు ప్రశ్నించారు. అదే ఏడాది అక్టోబర్ 29న ఈ ప్రాజెక్టుకి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టవద్దని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఉత్తర్వులు ఇచ్చిన సంగతి వాస్తవమా? కాదా? అంటూ ఆ ఉత్తర్వులు ప్రతుల్ని చూపించారు. అయినా వైకాపా ప్రభుత్వం స్వార్థ చింతనతో ఎన్జీటీ ఉత్తర్వులను ఉల్లంఘించి పనులు ప్రారంభించిందన్నారు. దీంతో 2021 జులై 7వ తేదీన ఎన్జీటీ స్పందించి డి పి ఆర్ కి విరుద్ధంగా జరిగిన అన్ని పనులను నిలిపివేయమని స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిన సంగతి మంత్రి రామానాయుడు శాసన మండలి దృష్టికి తీసుకువచ్చారు. అప్పుడు వైకాపా ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా, మరి నిద్రపోయారా అంటూ నిలదీశారు. చేసిన తప్పు సరిదిద్దుకోవటానికి రాయలసీమ ఎత్తిపోతల పథకం ఉద్దేశం సాగునీటికి కాదు, కేవలం తాగునీటి కోసం మాత్రమే అని 2023 ఆగస్టు 11వ తేదీన 364 జీవో ద్వారా అఫిడవిట్ ఇచ్చి లిఖితపూర్వక అబద్ధం ఆడింది మీరు కదా అని రామానాయుడు వాస్తవాలను సభ ముందు ఉంచారు. ఆ తదనంతరం 2024 మార్చి 22వ తేదీ తమ ఉత్తర్వులు కాదని పనులు చేపట్టినందుకు ఎన్జీటీ 2.65 కోట్లు జరిమానా విధించిందని రామానాయుడు చెప్పారు. అప్పుడు ఉన్నది వైకాపా ప్రభుత్వమే కదా. చంద్రబాబు నాయుడుకి ఏరకంగా ఈ ప్రాజెక్టు సంబంధం ఉంది? అని ధ్వజమెత్తారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం 2020లో మొదలెట్టి. ఆ తరువాత నాలుగేళ్లపాటు అధికారంలో ఉండి కూడా పూర్తి చేయలేని చేతకాని ప్రభుత్వం, చేతకాని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాదా అంటూ రామానాయుడు ఎద్దేవా చేశారు. కాబట్టి రాయలసీమ ద్రోహి జగనే అంటూ రామానాయుడు ఘాటుగా విమర్శించారు. 2014 -19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాయలసీమ జల వనరులకు గాను బడ్జెట్లో 14 వేల కోట్లు కేటాయించిన విషయాన్ని రామానాయుడు గుర్తు చేశారు. అలాగే 2019- 24 మధ్య వైకాపా ప్రభుత్వం కేవలం 2000 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. రాయలసీమలోని 17 లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులను కంటిన్యూ చేస్తున్నామని, 3,850 కోట్ల వ్యయంతో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలని 730 కిలోమీటర్లు తీసుకెళ్లి శివారు భూములను సైతం సస్యశ్యామలం చేస్తున్నామన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు. నేడు సీమలోని జలాశయాలన్నీ నిండుకుండల్లా జలకళతో చూడముచ్చటగా ఉన్నాయన్నారు. నాటి కృష్ణదేవరాయల కాలంలో తటాకాలన్నీ ఏమాదిరిగా ఉన్నాయో నేడు చంద్రబాబు నాయుడు హయాంలో కూడా రిజర్వాయర్లన్నీ అదే మాదిరిగా ఉన్నాయని సీమ ప్రజలు జేజేలు పలుకుతున్నారని రామానాయుడు చెప్పారు.

# అసైన్డ్ భూముల చట్టం సవరణకు శాసనసభ ఆమోదం

- క్లీన్ ఎనర్జీ కంపెనీలకు లీజు ద్వారా అసైన్డ్ భూముల కేటాయింపు: మంత్రి అనగాని
- ఏడాదికి రూ. 31 వేల లీజు
- ప్రతి రెండేళ్లకు 5 శాతం పెంపు
- చట్ట సవరణ ద్వారా 7.5 లక్షల మంది యువతకు ఉపాధి
- అసైనీలకు నికరమైన, అదనపు ఆదాయం

**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్రాభివృద్ధి, యువతకు ఉపాధి తోపాటు అసైనీదారులకు స్థిరమైన, అదనపు ఆదాయం కల్పించడం కోసం అసైనీ చట్టానికి సవరణ తీసుకొస్తున్న రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన చట్ట సవరణ ప్రతిపాదనను శాసనసభలో ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు, విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటుకు పునరుత్పాదక విద్యుత్ పరిశ్రమల(గ్రీన్ ఎనర్జీ) ఏర్పాటు చాలా కీలకమన్నారు. దేశంలోనే మొదటి సారిగా అనకాపల్లిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీని ప్రారంభించమని, అదేవిధంగా కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంటును కూడా ప్రారంభించామని చెప్పారు. పునరుత్పాదక విద్యుత్(క్లీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల ఏర్పాటుకు 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, ఈ పెట్టుబడులన్నీ గ్రౌండ్ అయితే దాదాపు 7.5 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని, దీంతో మొత్తం రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలంటే కొన్ని చోట్ల అసైన్డ్ భూములు అవసరమని, అందకే లీజు ప్రాతిపదికన ఆ భూములు తీసుకునేందుకు చట్ట సవరణ



చేస్తున్నట్లు చెప్పారు. 20 లక్షల మంది ఉపాధి కల్పించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యం నేరవేరడంలో ఈ చట్ట సవరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలపై ఉన్న విద్యుత్ ఛార్జీల భారాన్ని మరింత తగ్గించడానికి కూడా ఈ చట్ట సవరణ ఉపయోగపడుతుంది. ఇప్పటికే యూనిట్ పై 13 పైసలు తగ్గించాం. భవిష్యత్తులో మరింత తగ్గిస్తామన్నారు. క్లీన్ ఎనర్జీ ఉత్పాదన ఎంత ఎక్కువ పెరిగితే విద్యుత్ ఉత్పత్తిపై పెట్టే ఖర్చు అంత తక్కువ అవుతుందన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ లో భాగంగా నెట్ జీరో కార్బన్ స్థాయికి చేరుకోవాలన్న లక్ష్య సాధనకి ఈ చట్ట సవరణ దోహద బడుతుందన్నారు. అసైనీదారులు పూర్తి సమ్మతితో, వారి అంగీకరించిన తర్వాతే వారి వద్ద నుండి భూములు లీజుకు తీసుకుంటామన్నారు. ఈ భూములు లీజుకు ఇవ్వడం ద్వారా ఎకరానికి 31 వేల రూపాయల నికర ఆదాయం అసైనీదారులకు లభిస్తుందని, ఏడాదంతా వారి పోలంలో కష్టపడి పని చేసినా కచ్చితంగా ఆదాయం వస్తుందో రాదో తెలియని పరిస్థితని, ఒక వేళ ఏదైనా కారణం రీత్యా పంట నష్టపోతే పెట్టుబడి నష్టమే కాకుండా వారి శ్రమ విలువ కూడా కొల్పాతారని అన్నారు. అయితే వారి భూములను లీజుకు ఇవ్వడం ద్వారా లీజు ద్వారా నికరమైన ఆదాయం తోపాటు వారు ఏడాది పాటు శ్రమ చేసుకోవడం ద్వారా కూడా నికరమైన ఆదాయం లభిస్తుందన్నారు. మరోవైపు ప్రతి రెండేళ్ల ఒకసారి ఐదు శాతం లీజు పెంచడం జరుగుతుందన్నరు. అసైన్డ్ భూముల్లో చాలా చోట్ల బంజరు భూములు ఉన్నాయని, వీటిని లీజుకు ఇవ్వడం ద్వారా అసైనీలకు అదనపు ఆదాయం వస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# 7926 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

- మరో 2998 గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే
- ఆలస్యమైనా... తప్పులకు ఆస్కారం లేకుండా నిర్వహణ
- ఇప్పటి వరకు 19 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ
- శాసనసభలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి, కలంకౌంటర్ :** శాసనసభలో గురువారం టీడీపీ ఎమ్మెల్యేలు రీ సర్వేపై అడిగిన ప్రశ్నకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సమాధానమిచ్చారు. గత ప్రభుత్వంలో తొందరపాటు కారణంగా తప్పుల తడకగా రీ సర్వే సాగిందని అన్నారు. రీ సర్వే 1.0పై గ్రామ సభలు నిర్వహిస్తే 2.79 లక్షల ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిల్లో విస్తీర్ణం తేడాలకు సంబంధించి ఇప్పటికే 98 శాతం సమస్యలను పరిష్కరించామని చెప్పారు. దాదాపు 7.5 లక్షల జాయింట్ జాయింట్ ఎల్పీఎమ్ ల సమస్యలు వచ్చాయని, వాటిల్లో 2.98 లక్షలు పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని మార్చి నెలాఖరు లోపు పరిష్కరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం రీసర్వే 1.0 లో ప్రభుత్వ భూముల రీసర్వేకు మాత్రమే రోవర్స్ ను ఉపయోగించిందని, ప్రయివేట్ భూముల రీసర్వేలో రోవర్లను ఉపయోగించకుండా కేవలం డ్రోన్ల ద్వారా తీసిన డిజిటల్ ఇమేజస్ (ఓఆర్ఐ)ల ఆధారంగా మాత్రమే రీసర్వే చేసిందని, దీంతో చాలా చోట్ల ప్రయివేట్ భూముల విస్తీర్ణంలో తేడాలు



వచ్చాయని తెలిపారు. దీనికి తోడు రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూటింగ్(భూమిపై సర్వే) నిర్వహించే ముందు, నిర్వహించిన తర్వాత భూ యజమానులకు సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. రీసర్వే కాలం మొత్తాన్ని కేవలం 90 రోజుల్లోనే పూర్తి చేశారని, దీంతో సరైన ప్రమాణాలు పాటించకుండా హడావిడిగా రీసర్వే చేశారని అన్నారు. రీసర్వే చేసే సమయంలో భూ యజమానులు లేకపోవడం, వారి భూమి హద్దులు స్పష్టంగా చెప్పేవారు లేకపోవడంతో అధిక సంఖ్యలో జీశీఅత్ వ్రావీం (శ్రీఖఅన జ్ఞుతీషెవశ్రీ ఝజూం) లు ఏర్పడ్డాయన్నారు. రీసర్వే పూర్తయినప్పటికీ జీశీఅత్ వ్రావీం (శ్రీఖఅన జ్ఞుతీషెవశ్రీ ఝజూం) కారణంగా రైతులు ప్రభుత్వం నుండి పొందాల్సిన రుణాలు, రాయితీలను పొందలేకపోయారు. దీంతో రీసర్వే 1.0 పట్ల రైతులు ఆందోళన చెందారన్నారు. తన ప్రచార పిచ్చి కోసం జగన్ రెడ్డి రీసర్వే భూముల సరిహద్దు రాళ్లపై తన పేరు, బొమ్మను ముద్రించుకున్నారని, దీని వల్ల 660 కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని మట్టిపాలు చేశారని అన్నారు. దాదాపు 77,98,516 సర్వే రాళ్లను సేకరించి ఒక్కొరాయికి దాదాపు 846 రూపాయలు ఖర్చు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రీ సర్వే 2.0ను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 19 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపణీ చేశామని, రీ సర్వే పూర్తయిన వరకు మ-రో 14 లక్షల పాస్ పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉందలన్నారు. కొత్త పాస్ పుస్తకంపై రాజముద్రతోపాటు డైనమిక్ క్యూర్ కోడ్ ను ముద్రించినట్లు చెప్పారు. మొత్తం 15 రకాల రక్షణ అంశాలను పాస్ పుస్తకాల్లో చేర్చినట్లు చెప్పారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో తప్పులు సరిదిద్దేందుకు, రీ సర్వే చేయబోయే గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించేందుకు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# శ్రీకాకుళంలో డయేరియా, రాజమండ్రిలో కల్తీ పాల అంశంపై ముఖ్యమంత్రి సమీక్ష

- బాధితులకు వైద్య సాయం, బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం
- ఘటన జరిగాక స్పందించడం కాదు...ముందస్తు పర్యవేక్షణ అవసరం
- జిల్లా కలెక్టర్లు, అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి....ప్రజల్లో ఉంటేనే సమస్యలు తెలుస్తాయి
- వైద్యారోగ్యంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి,కలంకౌంటర్ :** శ్రీకాకుళం పట్టణంలో నీటి కలుషితం కారణంగా ప్రబలిన డయేరియా, రాజమండ్రిలో కల్తీ పాల కారణంగా పలువురు చనిపోయిన ఘటనలపై సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో జరిగిన ఈ సమీక్షలో మున్సిపల్, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. రెండు ఘటనల్లో బాధితులకు అందుతున్న వైద్య సాయంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన ఘటనల్లో బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశం సీఎం ఆదేశించారు. రెండు ఘటనలకు దారి తీసిన పరిస్థితులపై కారణాలను విశ్లేషించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఘటన జరిగాక స్పందించడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని, ముందస్తు పర్యవేక్షణ, అప్రమత్తత ద్వారా ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల్లోని జిల్లా స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడితే నివారించవచ్చని సీఎం అన్నారు. ప్రతి ప్రభుత్వ విభాగంలో కింది స్థాయి యంత్రాంగాన్ని యాక్టివేట్ చేసేందుకు, ఆయా విభాగాల్లో పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ఒక్కో సందర్భంలో ఒక్కో శాఖపై ఆకస్మిక తనిఖీకి వెళ్లడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. కిందిస్థాయి అధికారులతో పాటు...సంబంధిత శాఖల్లో జవాబుదారీ తనం పెరుగుతుందని...అప్పుడు ఇలాంటి ఘటనలు నివారించవచ్చని సీఎం స్పష్టం చేశారు. కలెక్టర్లు అంటే నిత్యం ప్రజల్లో ఉండాలని...అప్పుడే అనుకున్న మార్పు రాష్ట్ర స్థాయిలో చూపించగలమని సీఎం పేర్కొన్నారు. శ్రీకాకుళంలో తాగునీరు కలుషితం అయిన ఘటనలో ముందస్తు పర్యవేక్షణ, తనిఖీలు జరిగి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని సీఎం అభిప్రాయపడ్డారు.



**జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులు వివరించిన కలెక్టర్లు..** సీఎంతో సమీక్ష సందర్భంగా శ్రీకాకుళం జిల్లా, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వైద్య ఆరోగ్య శాఖ, మునిసిపల్ శాఖ అధికారులు రెండు ఘటనల్లోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు. డయేరియా ఘటనపై శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...'ఇప్పటి వరకూ 129 డయేరియా కేసులు నమోదు అయ్యాయి. ప్రస్తుతం 107 మందికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నాం. ఆరోగ్యం మెరుగువ్వటంతో 20 మందిని ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయ్యారు. డయేరియా పరిస్థితిని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. పైపుల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాను నిలుపుదల చేసి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నాం. నాలుగు ఇంజనీరింగ్ బృందాలు వివిధ ప్రాంతాల్లో 40 లీకులను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. 150 మంది సిబ్బంది, 7 జేసీబీలు, 2 బాబ్ కాట్ యంత్రాలు, 10 ట్రాక్టర్ల సాయంతో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాం. ఇవాళ రాత్రిలోగా విశాఖ నుంచి మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను శ్రీకాకుళానికి తరలిస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నాం. పారామెడిక్స్‌ను అందుబాటులో ఉంచాం. రిమ్స్, కిమ్స్, శ్రీకాకుళం జెమ్స్‌లో ప్రత్యేక వార్డుల ద్వారా డయేరియా రోగులకు చికిత్స అందిస్తున్నాం. నెఫ్రాలజీ నిపుణులు, ఇతర వైద్య నిపుణులను కూడా ఈ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. డయేరియా వ్యాప్తికి కారణం ఏమిటన్న దానిపై విచారణ చేస్తున్నాం. డోర్ టూ డోర్ సర్వే చేసి శానిటేషన్ కిట్‌ను అందజేస్తున్నాం. స్థానికులు వాటర్ ట్యాంకులు క్లీన్ చేయకపోవడం, పైప్ లైన్ల డ్రైన్లు క్రాస్ అవ్వడంతో పాటు వాటర్ ప్రెజర్ లేదని మోటార్లు పెట్టి నీటిని తీసుకోవడం వల్ల కలుషిత నీరు ఇళ్లకు చేరిందని" అధికారులు తెలిపారు.

**మెరుగైన చికిత్సకు వైద్య నిపుణులు..** అనంతరం కల్తీ పాల ఘటన, బాధితులకు అందుతోన్న వైద్య సాయంపై సీఎంకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ వివరించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ......"ఈ నెల 22 తేదీ జరిగిన కల్తీ పాల ఘటన వెలుగులోకి వచ్చింది. 20 మంది కల్తీ పాల కారణంగా అనారోగ్యం పాలయ్యారు. ఈ వ్యవహారంలో ఐదుగురు మృతి చెందారు. 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కల్తీ పాల సరఫరా జరిగిన చౌడేశ్వరీ నగర్, స్వరూప్ నగర్‌లో 9 వైద్య బృందాలను నియమించాం. 110 ఇళ్లను సందర్శించి 315 మంది నుంచి రక్త నమూనాలు కూడా సేకరించి విశ్లేషిస్తున్నాం. కల్తీ పాలను సేవించిన 957 మందిని ప్రతీ రోజూ పరీక్షిస్తున్నాం. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం కూడా అందించాం. ఈ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ వైద్య బృందాలను కూడా అందుబాటులో ఉంచాం. ఈ ఘటనలో నిందితుడైన పాల సరఫరాదారు అడ్డాల గణేశ్వరరావుపై క్రిమినల్ కేసు నమోదు చేసి కస్టడీకి తీసుకుని విచారణ చేస్తున్నాం. అసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 8 మంది పరిస్థితి ఇప్పటికీ క్రిటికల్‌గా ఉందని...ఇతర ప్రాంతల నుంచి వైద్య పరికరాలు తెప్పించి, నిపుణులైన డాక్టర్లను తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నాం. మిగిలిన ప్రాణాలు కాపాడేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం" అని వివరించారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తనిఖీ చేస్తున్నారని అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, నిమ్మల రామనాయుడుతో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి ఆన్ లైన్ విధానంలో రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, శ్రీకాకుళం, రాజమండ్రి ఎమ్మెల్యేలతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

# క్రేన్ సంస్థల ఆధ్వర్యంలో వైభవంగా శ్రీ శ్రీనివాస కళ్యాణం









**గుంటూరు,కలంకౌంటర్ :** క్రేన్ రిలీజియన్ ట్రస్ట్ గ్రంధి సుబ్బారావు ధర్మపత్ని లక్ష్మీనరసింహ శ్రీ వరసిద్ధ విగ్నేశ్వర వేద ఆగమశాస్త్ర పాఠశాల యందు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, అహోబిల రామానుజ చిన్న జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణ లో శ్రీ శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. క్రేన్ సంస్థల అధినేత గ్రంధి వెంకట సత్య లక్ష్మీ కాంతారావు ధర్మపత్ని లక్ష్మీ హైమావతి వారి కుటుంబ సభ్యులచే కళ్యాణం నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిన్న జీయర్ స్వామి భక్తులకు తమ సందేశాన్ని వినిపించారు.

# జగన్ ను కలసిన బుర్రా



**నెల్లూరు, కలంకౌంటర్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కు విచ్చేసిన మాజీ ముఖ్య మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసిన మాజీ శాసన సభ్యులు కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధు సూదన్ యాదవ్.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి-- లేబర్ ఇన్స్పెక్టర్ పి.సుజాత

**-- స్కందపురి ఆగ్రో మెకానికల్ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు**



**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రభుత్వ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు లేబర్ ఇన్స్పెక్టర్ పి సుజాత అన్నారు. గురువారం స్కందపురి ఆగ్రో మెకానికల్ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు సందర్భంగా సుమారు 150 మంది కందుకూరు లేబర్ ఇన్స్పెక్టర్ ను వారి కార్యాలయము నందు ఆమెను కలిసి వారి యూనియన్ పేరును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈశ్రం, పి ఎం ఎస్ వై లో పేరు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈశ్రం లో పేరును ఒకసారి నమోదు చేసుకుంటే ప్రమాద బీమా ఒక లక్ష రూపాయలు, ఒకవేళ కార్మికుడు మరణిస్తే ఆ కుటుంబానికి మూడు లక్షల రూపాయలు వస్తాయని ఆమె తెలిపారు. అదేవిధంగా పి ఎం ఎస్ వై పథకంలో చేరి 60 ఏళ్లు వచ్చే వరకు ప్రభుత్వం వారు సూచించిన మొత్తాన్ని చెల్లించిన యడలా 60 సంవత్సరాల నుంచి జీవితాంతం ప్రతినెల 3000 పెన్షన్ వస్తుందని ఆమె తెలిపారు. అనంతరం లేబర్ ఇన్స్పెక్టర్ ను యూనియన్ వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కందపురి ఆగ్రో మెకానికల్ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పీలా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నూకల వెంకట సుబ్బారావు, కోశాధికారి గొర్రెపాటి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ షేక్ హాజీ భాష, వైస్ ప్రెసిడెంట్ షేక్ అరీఫ్ జాయింట్ సెక్రెటరీ మద్దసాని కొండయ్య కో ట్రెజరర్ పర్వేజ్ సద్దాం, వీరితోపాటు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# నీట్-2026కు పూర్తిస్థాయిలో సన్నద్ధత - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ గురువారం నీట్-2026 పరీక్ష నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై సమగ్ర నివేదికను సమర్పించారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన కేంద్రాలను సిద్ధంగా ఉంచడం, భద్రతా చర్యలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా ఎన్‌టీఆర్ జిల్లాలో పరీక్ష నిర్వహణను సీసీటీవీల ద్వారా పర్యవేక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పరీక్ష పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎన్‌టీఆర్ జిల్లా నీట్ పరీక్షల సమన్వయకర్త డా. ఎం.గోపీకృష్ణ పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన సిబ్బంది సమన్వయం, కేంద్రాల పర్యవేక్షణ తదితర అంశాలపై ఆయన వివరాలు తెలియజేశారు. జిల్లాలో నీట్--2026 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర సన్నద్ధతతో ఉందని అధికారులు తెలిపారు.

# 53 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ. 5.30 లక్షల జరిమానా

## -జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 53 కేసులు నమోదు చేసి, విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ శ్రీ ఎం.ఎస్.హెచ్. ఆర్. తేజ చక్రవర్తి గారు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 53 మందికి రూ. 5.30 లక్షలను జరిమానగా విధించారని జిల్లా ఎస్పీ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనాలను ఢీ కొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతీ రోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులో భాగంగా ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ, మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. గడిచిన మూడు నెలలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన సుమారు 110 మందికి జైలు శిక్ష పడిందని తెలిపిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

# సోము వీర్రాజు పై దాడికి యత్నం దురదృష్టకరం-మంత్రి మండిపల్లి

**అమరావతి,కలంకౌంటర్ :** శాసనమండలిలో భాజపా నేత సోము వీర్రాజు పై దాడి యత్నం పై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి. శాసనమండలిలో భాజపా నేత సోము వీర్రాజు పై దాడి యత్నం అత్యంత దురదృష్టకరం. ప్రజాస్వామ్య దేవాలయమైన సభలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. విభిన్న అభిప్రాయాలు ఉండొచ్చు, కానీ దాడులకు దిగడం అనాగరిక చర్య. సభా మర్యాదలు, నియమ నిబంధనలు పాటించడం ప్రతి సభ్యుడి బాధ్యత. చైర్మన్ నిర్ణయాన్ని గౌరవించకుండా ఆగ్రహానికి లోనవడం తగదు. ప్రజలు ఇచ్చిన హోదాను వైకాపా నేతలు దుర్వినియోగం చేయడం సరికాదు. మొన్న చెప్పులు వేసుకుని దేవుడి ఫోటోలు పట్టుకోని అపచారం చేయడం వంటి వాటిపై వైసీపీ సభ్యులు తమ ప్రవర్తనపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

# అసెంబ్లీ క్రీడా మహోత్సవంలో పాల్గొన్న

## - ఎం ఎల్ ఏ ఇంటూరి నాగేశ్వరరావు



**అమరావతి,కలంకౌంటర్ :** అసెంబ్లీ క్రీడా మహోత్సవం - ఆటవిడుపు కార్యక్రమాల్లో భాగంగా... కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గురువారం పలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో. మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పోటీలను వీక్షిస్తూ సందడి చేశారు. నిత్యం ప్రజా సమస్యలు, బిజీ షెడ్యూల్స్ మధ్య ఇలాంటి ఉల్లాసమైన కార్యక్రమాల్లో పాల్గొనటం ఎంతో ఆనందాన్నిచ్చిందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

# చర్యలు తీసుకోవాలి...



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పట్టాభి స్మారక భవన నిర్మాణ విషయంలో హైకోర్టు వారి ఉత్తర్వులను గౌరవించని మున్సిపల్ కౌన్సిల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రముఖ న్యాయవాది, పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షుడు లంకి శెట్టి బాలాజీ జిల్లా కలెక్టర్ ను కోరారు. పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ సమావేశం గురువారం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది, పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ఉపాధ్యక్షుడు, లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ. హైకోర్టు రిట్ పిటిషన్ నెంబర్ 33303/2023 నందు జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయని మచిలీపట్నం నగర కార్పొరేషన్ కౌన్సిల్ పై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను పట్టాభి స్మారక భవన కమిటీ తరఫున కోరుతున్నాము అన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలుపరిచి కౌన్సిల్ సమావేశంలో చర్చించి బ్యాంకు వారికి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు కౌన్సిల్ వారు ఏమీ చేయకుండా బ్యాంకు వారు కౌన్సిల్ వారిని కలవలేదని మచిలీపట్నం నగర కార్పొరేషన్ మేయర్, వైసిపి కార్పొరేటర్లు మాట్లాడటం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు అన్నారు. పట్టాభి స్మారక భవన కమిటీ ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ.. పట్టాభి స్మారక భవనం నిర్మాణ కమిటీ తరఫున మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పలుమార్లు ఇంటికి వెళ్లి కలిసిన స్మారక భవన కమిటీ తరఫున ఇచ్చిన రిప్రజెంటేషన్ చెత్త బుట్టలో వేసి, బ్యాంకు వారిని సంప్రదించకపోవడం చూస్తుంటే అధికార గర్వం ఎంతుందో మచిలీపట్నం నగర కార్పొరేషన్ వైసిపి అధికార కౌన్సిల్ వారికి అని ప్రజలు గ్రహించాలి అన్నారు. జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు, గడ్డం రాజు మాట్లాడుతూ.ఎ భోగరాజు పట్టాభి సీతారామయ్య తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన మహనీయుడు అన్నారు. అటువంటి మహనీయుడి పేరిట స్మారక భవనం నిర్మించి పేద ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే విధంగా వివిధ రకాల శిక్షణలు ఆ భవనం ద్వారా ఇప్పించి, పేద ప్రజలను ఆర్థికంగా బలపరుస్తామంటే వైసిపి మేయర్, కార్పొరేటర్లు కౌన్సిల్లో తీర్మానం చేయకుండా అడ్డుకోవడం ఎంతో దుర్మార్గం అన్నారు. కౌన్సిల్ పదవీకాలం త్వరలో ముగియబోతోంది అని, ఇప్పటికైనా వైసీపీ మేయర్, కార్పొరేటర్లు మచిలీపట్నం నగర అభివృద్ధికి సహకరించి వెంటనే పట్టాభి స్మారక భవనం కోసం రాజకీయాల కు అతీతంగా పట్టాభి స్మారక భవనం నిర్మాణం కోసం తీర్మానం చేసి ఆ భవన నిర్మాణంలో వైసిపి మేయర్, కార్పొరేటర్లు భాగస్వాములు అవ్వాలని ప్రజల ఆకాంక్షను తీర్చాలని వారిని కోరుతున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ సభ్యులు, పి ఎస్ ఎస్ ఆర్ శర్మ, నిమ్మ గడ్డ శ్రీధర్, లంకి శెట్టి సంతోష్, కేబీవీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఎకరాకు నీటితో తెలుగు తల్లికి జలహారతి

(మొదటిపేజీ తరువాయి)

నిల్వ చేసుకునే అవకాశం ఉందని ప్రస్తుతం 793 టీఎంసీల మేర నీటితో రిజర్వాయర్లు కళకళ లాడుతున్నాయని సీఎం అన్నారు. అందుకే పంట సీజన్ ను ముందుకు జరిపేలా మే 15 నాటికే నారుమళ్లకు నీరు ఇచ్చేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. దీనికి అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధులంతా రైతులను చైతన్యవంతులను చేయాలని స్పష్టం చేశారు. 16 లక్షల హెక్టార్ల మైక్రో ఇరిగేషన్ తో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉందని ముఖ్యమంత్రి వివరించారు. నీటి నిర్వహణ నుంచి పొదుపు చేసే వరకూ వివిధ కార్యక్రమాలను రైతులతో కూడిన నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భజలాల పెంపునకు కూడా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సగటున 7.3 మీటర్ల లోతున భూగర్భజలాలు ఉన్నాయని రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న జల సంరక్షణా చర్యల కారణంగా సగటున 6 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయన్నారు. తద్వారా చాలా ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల ద్వారా విద్యుత్ వినియోగం కూడా తగ్గిందని.. రూ 91 కోట్ల మేర విద్యుత్ కూడా ఆదా అయ్యిందని వివరించారు. నదులు పారే చివరి రాష్ట్రంగా ఏపీకి ఉండే నీటి భద్రత మరే రాష్ట్రానికీ లేదన్నారు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని.. తిరుమలలో 89 శాతం మేర పచ్చదనం ఉందన్నారు.

**పోలవరం-నల్లమల సాగర్ లింకు రెండు రాష్ట్రాలకూ లాభమే..** పోలవరం – నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని.. పొరుగు రాష్ట్రం దీనిపై అభ్యంతరాలను తెలియచేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి శాసనసభలో వ్యాఖ్యానించారు. గోదావరి నుంచి వృధాగా సముద్రంలోకి వెళ్లే వరద జలాలను మాత్రమే తరలించేలా ఈ ప్రాజెక్టు చేపట్టామని అన్నారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా.. దీనికి తాము ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుతో రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందన్నారు. గత పాలనలో గుండ్లకమ్మ గేట్లు కొట్టుకు పోతే వాటిని పెట్టేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని.. పోలవరం డయాఫ్రాం వాల్ కొట్టుకు పోయినా దానిని గుర్తించలేని పరిస్థితి సీఎం ఎద్దేవా చేశారు. తాను చేయని తప్పు కు అరెస్టు చేసిన తనను 53 రోజుల పాటు జైల్లో పెట్టారని సీఎం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. నీటి భద్రతను ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యల్ని తీసుకువస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రతీ ఎకరాకు సాగునీరు, ప్రతీ ఇంటికీ సాగునీరు, పరిశ్రమలకు నీరు ఇచ్చేలా సంకల్పంతో పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

# రాబోయే కాలంలో లెజిస్టేటివ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ జరగాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్ష

- ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ -- 2026 కి ముఖ్యఅతిథిగా హాజరు
- స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశంసలు
- లెజిస్లేటివ్ సౌత్ ఇండియా ప్రీమియర్ లీగ్ కు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన
- వైజాగ్ స్టేడియంలో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామన్న ఎంపీ కేశినేని శివనాథ్





**విజయవాడ,కలంకౌంటర్ :** సౌత్ ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్, అసెంబ్లీ ఎమ్మెల్యేలతో క్రికెట్ పోటీలు నిర్వహించాలనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచనను ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశంసించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన రాబోయే కాలంలో లెజిస్టేటివ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు పునాది కావాలని ఆకాంక్షించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ స్టేట్ లేజిస్టేటివ్ స్పోర్ట్స్ మీట్ -2026 కి ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం హాజరై క్రీడలు ఆడుతున్న ప్రజాప్రతినిధులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాబోయే ఏడాది లెజిస్లేటివ్ సౌత్ ఇండియా ప్రీమియర్ లీగ్ కు వైజాగ్ స్టేడియం వేదిక కాబోతున్నందుకు ఆనందం గా వుందన్నారు. వీటిని ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ స్పోర్ట్స్ మీట్ ప్రజాప్రతినిధుల మధ్య ఐక్యత, ఫిట్‌నెస్, క్రీడా స్ఫూర్తి పెంపొందిస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు తమ నియోజవర్గ బాధ్యతలతో పాటు , స్పోర్ట్స్‌లో కూడా యాక్టివ్ గా పాల్గొనటాన్ని అభినందించారు. ఆల్ రౌండర్ ప్రతిభ చూపుతున్న హోం మంత్రి అనిత ను ప్రత్యేకంగా కొనియాడారు. అలాగే ఇప్పటి కి ఫిట్ నెస్ తో వుంటూ యువకులలా కనిపించే ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్ లను అభినందించారు. స్టేడియం అంతా తిరిగి ప్రజాప్రతినిధులను అప్యాయంగా ఎంపీ కేశినేని శివనాథ్ పలకరించారు.



# “స్వర్గపురి “ లో పార్థివ దేహ విశ్రమాలయ ప్రారంభం..

## కాటం వెంకట్రావు రీజినల్ హెడ్, యూనియన్ బ్యాంక్.






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మనిషి మరణానంతరం కూడా సకల సౌకర్యాలతో పార్థివ దేహానికి కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించుకొందుకు వీలుగా, నిర్వాహకులు “స్వర్గపురి” లో ఏర్పాట్లు చేయడం అభినందనీయమని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కాటం వెంకట్రావు అన్నారు. మూడు స్తంభాల సెంటర్ సమీపంలో శ్రీ అన్నపూర్ణా సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం పార్థివ దేహ విశ్రమాలయ ప్రారంభోత్సవాన్ని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ కాటం వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ “స్వర్గపురి” నిర్మిత పార్థివ దేహ విశ్రమాలయం మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎంతో ఉపయోగకరం గా, ఉపయుక్తంగా ఉంటుందన్నారు. బయటి ఊరి నుండి వచ్చి వెంటనే మరణానంతర విధులు, కార్యక్రమాలు నిర్వహించ లేని వారు, అద్దె గృహాలలో నివసించు వారికి, ఇతర దేశములలో నివసించే వారి పిల్లల రాక కోసం వేచి చూడ వలసిన వారికి, పార్థివ దేహ విశ్రమాలయం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పార్థివ దేహం పాడవకుండా ఫ్రీజర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగరంలో ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేసిన దాతలను అభినందిస్తూ తమ యూనియన్ బ్యాంకు నుండి విశ్రమాలయానికి ఏసీ నిమిత్తం 75 వేల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా మరణానంతర విధులు కూడా నిర్వహించుటకు కావలసిన సౌకర్యాలు, సదుపాయములతో, కుల మత రహితముగా జరుపు కొనుటకు, ఏర్పాట్లు కలిగి ఉండడం పట్ల నిర్వాహకులను అభినందించారు. నూతన నిర్మాణమును తన చేతుల మీదుగా నిర్వహించడం తాను పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యఫలం అన్నారు. తాను కూడా భవిష్యత్తులో ఈ స్వర్గపురికి చేదోడువాదోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. “స్వర్గపురి” నిర్వాహకులు,ఆలయ కమిటీ అధ్యక్షులు దొరడ్ల హేమ ప్రకాష్ మాట్లాడుతూ దాతల దాతృత్వంతో ఈ స్వర్గపురిని అత్యంత అద్భుతంగా తీర్చి తీర్చిదిద్దుతున్నందుకు ఆనందదాయకంగా ఉందన్నారు. మరణానంతరం కూడా ఆ వ్యక్తిని సముచితంగా, ప్రశాంతంగా పుణ్యలోకాలకు పంపించాలనే సదాశయంతో ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్న దాతలకు శతకోటి వందనాలని తెలిపారు. ఈ కార్యక్రమములో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసిస్టెంట్ రీజినల్ హెడ్ ఉమా రామ లింగా రెడ్డి, కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజర్ రామ్ చరణ్ తేజ, గది నిర్మాణ సహకారం అందించిన దాతలు, గుడివాడ సోమేశ్వర రావు, శిర్విసెట్టి భాస్కర్ లు, ఆలయ కమిటీ అధ్యక్షులు దొరడ్ల హేమ ప్రకాష్, కార్యదర్శి గుడివాడ మెహెర్ ప్రసాద్, కోశాధికారి ఉడత్తు దుర్గా ప్రసాదరావు, , ఉప కార్యదర్శి వాకమల్లు శ్రీనివాస రావు,కమిటీ సభ్యులు అన్నం రామకృష్ణ బాబు రావు, కొప్పర్తి రవి శంకర్, పాలకుర్తి శరత్ కుమార్, రాళ్ళబండి రాజారామ్,కేఆర్ కేఎం మాస్టారు, లంక గంగాధర్, గుడివాడ రవికుమార్, ఉదయగిరి సతీష్, పాలకుర్తి గిరి, తమ్మన నారాయణ రావు, ఊర రామాంజనేయులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

## –జిల్లా కలెక్టర్ డి కే బాలాజీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వచ్చే మార్చి నెల 1 వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం విమానాశ్రయానికి విచ్చేయనున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి క్యాంపు కార్యాలయం నుండి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులు, విమానాశ్రయ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే మార్చి నెల 1వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్నారన్నారు. వారు 1 వ తేదీన మధ్యాహ్నం తిరుపతి నుండి విమానంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి మధ్యాహ్నం 12:40 గంటలకు చేరుకుంటారన్నారు. అనంతరం విజయవాడలోని నోవాటెల్ కు వెళతారన్నారు.. తదుపరి అదే రోజు రాత్రి 7 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి బయలుదేరి ఢిల్లీ వెళతారన్నారు. వారితోపాటు మరో 7 మంది న్యాయమూర్తులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి స్వాగతం, వీడ్కోలు కార్యక్రమాలు ప్రోటోకాల్ ప్రకారం అన్ని సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వారి వాహనశ్రేణి రాకపోకలకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరగాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చోట్ల గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. వారికి కావలసిన వాహనాలను సమకూర్చాలన్నారు. గన్నవరం విమానాశ్రయంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి లోటు లేకుండా, అగ్ని ప్రమాదం జరగకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ జూమ్ సమావేశంలో జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# స్వర్గీయ అన్న ఎన్టీఆర్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలి






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తెలుగువారి ఆరాధ్య దైవం స్వర్గీయ అన్న ఎన్టీఆర్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరుతూ, ఆ అవార్డుకు అడ్డంకులు తొలగాలని భగవంతుని ప్రార్థిస్తూ మాల ధారణతో కూడిన పాదయాత్రను కృష్ణాజిల్లా నిమ్మకూరు నుంచి సత్యసాయి జిల్లా ధర్మవరం టౌనుకు చెందిన బి ఎల్ నరసింహులు ఎంతో కఠినమైన దీక్షతో ప్రారంభించి జిల్లా మొత్తం పాదయాత్రతో పర్యటించి విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం చేసుకుని 41 రోజులపాటు ఈ పాదయాత్ర చేసుకుని మరల స్వర్గీయ అన్న ఎన్టీఆర్ సొంత గ్రామమైన నిమ్మకూరులో ఎన్టీఆర్ దంపతుల విగ్రహాల వద్ద ఈ దీక్షను విరమించడం జరుగుతుందని బిఎల్ నరసింహులు తెలిపారు..... బి ఎల్ నరసింహులు స్వర్గీయ ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న పాదయాత్ర 12వ రోజు అయిన గురువారం మచిలీపట్నం విచ్చేసిన సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు, లోగిశెట్టి స్వామి ఆధ్వర్యంలో ఆయనకు అభినందనలు తెలిపి, పాదయాత్ర విజయవంతం అవ్వాలని కోరి, పాదయాత్ర చేస్తున్న బిఎల్ నరసింహులను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి, బిఎల్ నరసింహులు పాదయాత్రకు మద్దతు తెలిపారు...... ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు, లోగిశెట్టి వెంకటస్వామి మాట్లాడుతూ...... తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహనీయుడు స్వర్గీయ అన్న ఎన్టీఆర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారం తెచ్చి ఆనాటి ఢిల్లీ పెద్దలను గడగడ లాడించి తెలుగువారి కోసం పోరాటం చేసిన మహనీయుడు అన్నారు. పేదవారికోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరుపేదలకు అండగా నిలిచిన మహనీయుడు స్వర్గీయ ఎన్టీఆర్ అన్నారు. రాజకీయ రంగంలోనే కాకుండా సినీ రంగంలో కూడా తనదైన ఖ్యాతిని చాటుకుని తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు స్వర్గీయ ఎన్టీఆర్ అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఇప్పటికీ ఎప్పటికీ తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని అలాంటి మహనీయుడికి కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్న అవార్డు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాము అన్నారు. బి ఎల్ నరసింహులు పాదయాత్రకు మచిలీపట్నం నగర తెలుగుదేశం పార్టీ తరఫున మద్దతు తెలుపుతున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎండి ఇలియాస్ పాషా, అడపా రత్నాకర్, కొల్లు రంగ, వి. వెంకటేశ్వరరావు, వనం రెడ్డి ప్రసాద్, కోమటి శ్రీనివాస్, కే. వెంకటేశ్వరరావు, కే .ఎర్రబాబు, టి .రాజ్యలక్ష్మి, అంకం లక్ష్మి, అబ్దుల్ అజీమ్, షేక్ ఫిరోజ్, తోట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట భద్రత నడుమ ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు..

- ఈవీఎం, వీవీప్యాట్ గోదాము వద్ద నిరంతర పర్యవేక్షణ..
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** ఈవీఎం, వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రత కల్పించడం జరిగినప్పటికి నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ మూడు నెలలకు ఒక సారి (త్రైమాసిక) తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో జిల్లా కలెక్టర్ తో పాటు డిప్యూటీ సీఈవో, ఈవీఎంల నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, కందుల పరమేశ్వరరావు (ఆమ్ ఆద్మీ పార్టీ), జె.శ్రీనివాసరావు (జనసేన), బి.కృష్ణారెడ్డి (బీజేపీ), సురేష్ సిపిఐ (ఎం), కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్ పి.సలీమ్, డిప్యూటి తహశీల్దార్ ఎ.ఎస్.ఆర్ గోపాల రెడ్డి తదితరులు ఉన్నారు.

# న్యాయవ్యవస్థపై ఎన్‌సీఈఆర్‌టీ 'కుట్ర'.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

- వివాదాస్పద పాఠ్యపుస్తకంపై తక్షణ నిషేధం
- న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోందంటూ సీజేఐ ఆగ్రహం
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కేంద్రం
- అవినీతి పాఠ్యాంశంపై కఠిన చర్యలు.. మార్చి 11న తదుపరి విచారణకు ఆదేశం

**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను మంటగలిపేలా పాఠ్యపుస్తకాల్లో అభ్యంతరకర అంశాలను ప్రచురించిన ఎన్‌సీఈఆర్‌టీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పుస్తకంలో న్యాయవ్యవస్థలోని అవినీతిపై చేర్చిన అధ్యాయాన్ని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆ పుస్తకంపై తక్షణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది కేవలం పొరపాటు కాదు న్యాయవ్యవస్థను కించపరిచేలా చేసిన ఉద్దేశపూర్వక కుట్ర అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**బుల్లెట్ తగిలి రక్తం చిందిస్తోంది: సీజేఐ..** విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. “ఎన్‌సీఈఆర్‌టీ ప్రయోగించిన బుల్లెట్ తో న్యాయవ్యవస్థ రక్తం చిందిస్తోంది.

కోర్టుల విశిష్ట చరిత్రను వివరించాల్సింది పోయి వ్యవస్థను అణచివేసేలా పాఠాలు రాయడం సరికాదు” అని మండిపడ్డారు. యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల అగౌరవం కలిగించేలా ఈ పాఠ్యాంశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులెవరో తేలేవరకు ఈ విషయాన్ని వదిలిపెట్టబోమని, జవాబుదారీతనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com